సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం, 29, నవంబర్, 2023



అక్కడ ఎలా ఉంది ?!

ఈ ఎన్నికల్లో ఏ పార్టీ పరిస్థితి ఎలా ఉంది, ఎవరి వైపు మొగ్గు ఉందంటూ ఇతర దేశాల్లో ఉన్నవారు ఫోన్ ద్వారా ఆరా తీస్తున్నారు. 2లో



పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని కోరుతూ వివిధ ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. 2లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 20°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. రాత్రికి చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిచారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ధైర్యంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

కొత్తగూడెంటౌన్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని, ప్రజలు ధైర్యంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్పీ డాక్టర్ వినీత్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ కీలకమైనదని, ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా డబ్బు, మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న రూ.3,09,70,240 నగదు, రూ.19,80,486 విలువైన 1,820 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

ష్‌... గప్‌చుప్‌ !

ముగిసిన ఎన్నికల ప్రచారం

- దూకుడు ప్రదర్శించిన బీఆర్‌ఎస్
- కాంగ్రెస్ తరఫున జిల్లాకు వచ్చిన అగ్రనేత రాహుల్
- శక్తివంచన లేకుండా పర్యటించిన స్వతంత్రులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల హడావుడి చివరి దశకు చేరుకుంది. పల్లె, పట్నం, ఊరూ వాడా తేడా లేకుండా తీరిక లేకుండా సాగిన ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంటలతో ముగిసిపోయింది. ఆ తర్వాత చేయాల్సిన ఎన్నికల ఏర్పాట్లలో పార్టీలు, అభ్యర్థులు, కార్యకర్తలు, మద్దతుదారులు మునిగిపోయారు.

కేసీఆర్ సభలతో బీఆర్‌ఎస్ ముందంజ..

మిగిలిన రాజకీయ పార్టీల కంటే ముందుగానే భారత రాష్ట్ర సమితి ఐదు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. నామినేషన్లు దాఖలు చేయకముందే ఆ పార్టీ అధినేత కేసీఆర్ జిల్లాలో ప్రచారం ప్రారంభించారు. నవంబర్ 1న ఇల్లెందు, 5న కొత్తగూడెంలలో నిర్వహించిన బహిరంగ సభల్లో పాల్గొన్నారు. నామినేషన్లు ముగిసిన తర్వాత నవంబర్ 13న పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్ కేటీఆర్ సైతం జిల్లాలో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. అందులో భాగంగా ఇల్లెందు, కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేటలో ప్రచారం నిర్వహించారు. ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, సీపీఐతో పోలిస్తే ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ ముందు వరుసలో నిలిచింది.

రాహుల్ రాకతో 'హస్తం'లో జోష్..

హడావుడి లేకపోయినా సంప్రదాయ ఓటు బ్యాంకు అండతో కాంగ్రెస్ పార్టీ ప్రభావవంతంగా ప్రచారం నిర్వహించింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చింది మొదలు నామినేషన్ల చివరి దశ వరకు అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీలో తర్జనభర్జనలు జరిగాయి. దీంతో బీఆర్‌ఎస్, బీజేపీతో పోలిస్తే ప్రచారంలో ఆ పార్టీ వెనుకబడినట్టు ఆదిలో కనిపించింది. కానీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పినపాకలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌తో కార్యకర్తల్లో ఒక్కసారిగా జోష్ వచ్చింది. ఆ తర్వాత జూలు విదిల్చిన సింహాల్లా పార్టీ శ్రేణులు ప్రచారంలో దూకాయి. దీంతో స్టార్ క్యాంపెయినర్ల హడావుడి లేకపోయినా పీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశంలో తక్కువ సమయంలోనే కాంగ్రెస్ జనబాహుళ్యంలోకి చొచ్చుకుపోయింది. పొత్తులో భాగంగా సీపీఐ తరఫున కొత్తగూడెం నుంచి పోటీ చేస్తున్న కూనంనేని సాంబశివరావుకు మద్దతుగా ప్రియాంకగాంధీ ప్రచారంలో పాల్గొనాల్సి ఉండగా చివరి నిమిషంలో ఆమె పర్యటన రద్దయ్యింది. ఇదే తీరుగా పీసీసీ చీఫ్ రేవంత్ కూడా ఇల్లెందు సభకు రాలేకపోయారు.

ప్రత్యేకత చాటిన ఇతర పార్టీలు, స్వతంత్రులు..

ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీలకు తోడు బహుజన్ సమాజ్ పార్టీ, సీపీఎం, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలతో పాటు స్వంతంత్ర అభ్యర్థులు శక్తి వంచన లేకుండా ప్రచారం నిర్వహించి ప్రత్యేకత చాటారు. ముఖ్యంగా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి కొత్తగూడెంలో జలగం వెంకటరావు ప్రచారంలో ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇచ్చారు. బీఎస్పీ అభ్యర్థి యెర్రా కామేశ్ సైతం చెమటోడ్చారు. వీరితో పాటు ఇల్లెందులో చీమల వెంకటేశ్వర్లు, పినపాకలో ఊకే ముద్దరాజు, కొత్తగూడెంలో ఇమంది ఉదయ్ తదితరులు విస్తృత ప్రచారం నిర్వహించారు. బీజేపీ నుంచి ఈటల రాజేందర్, జనసేన నుంచి పవన్‌కళ్యాణ్ ఆయా అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు.

మూగబోయిన మైకులు..

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది మొదలు ప్రచార సందడి ప్రారంభమైంది. ముఖ్యంగా ఈనెల 3 నుంచి నామినేషన్ల స్వీకారం మొదలవడంతో ప్రచారం మరింత ఊపందుకుంది. ఆ తర్వాత స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియ ముగిసి, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన తర్వాత ఆకాశమే హద్దుగా అభ్యర్థులు ప్రచారం చేశారు. డోర్ టూ డోర్, జీపు జాతాలు, ప్రత్యేక ఎన్నికల వాహనాలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు, సోషల్ మీడియా ఇలా అందుబాటులో ఉన్న ప్రతీ మార్గంలో ప్రచారాన్ని హోరెత్తించారు. క్షణం తీరిక లేకుండా ప్రచార వాహనాలు రోడ్లపై చక్కర్లు కొట్టాయి. చెవులకు చిల్లులు పడతాయా అన్నట్టుగా అభ్యర్థులు, ఆయా పార్టీల తరఫున రూపొందించిన ప్రత్యేక గీతాలు మార్మోగాయి. డీజే చప్పుళ్ల సందడి చేశాయి. మరోవైపు రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రజలు సైతం అంతే ఆసక్తి చూపించారు. పనులు మానుకుని రోడ్‌షోలు, బహిరంగ సభలకు హాజరయ్యారు. ఇలా సభలకు వచ్చే ప్రజలు ఉపాధి కోల్పోకుండా తగు మొత్తాలను పార్టీలు సైతం చెల్లించాయి.

జంగ్ తెలంగాణ

1,098 పోలింగ్ కేంద్రాలు

27 మండలాల్లో 9,66,439 మంది ఓటర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో గల 701 లొకేషన్లలో మొత్తం 1,098 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పినపాక నియోజకవర్గంలో 7 మండలాలు ఉండగా ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో ఐదు చొప్పున ఉన్నాయి. వీటి పరిధిలో గురువారం పోలింగ్ జరగనుంది. జిల్లాలో పురుష ఓటర్లు 4,71,745 మంది, మహిళా ఓటర్లు 4,94,650, ఇతరులు 44.. మొత్తం 9,66,439 మంది ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఇలా..

పినపాక నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉండగా 147 లొకేషన్లలో 244 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ పురుష ఓటర్లు 97,821 మంది, మహిళా ఓటర్లు 1,00,577, ఇతరులు నలుగురు కలిపి మొత్తం 1,98,402 మంది ఓటర్లు ఉన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో కలిపి 172 లొకేషన్ల పరిధిలో 241 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ పురుష ఓటర్లు 1,07,909, మహిళా ఓటర్లు 1,11,658, ఇతరులు ఇద్దరు కలిపి మొత్తం 2,19,569 మంది ఓటర్లు ఉన్నారు. ఖమ్మం జిల్లా కామేపల్లి, మహబూబాబాద్ జిల్లా గార్ల, బయ్యారం మండలాలు కూడా ఈ నియోజకవర్గం పరిధిలోనే ఉన్నాయి. కొత్తగూడెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కలిపి 137 లొకేషన్లలో 253 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ పురుష ఓటర్లు 1,18,385 మంది, మహిళా ఓటర్లు 1,25,434, ఇతరులు 27 కలిపి మొత్తం 2,43,846 మంది ఓటర్లు ఉన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా 124 లొకేషన్ల పరిధిలో 184 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ పురుష ఓటర్లు 76,193, మహిళా ఓటర్లు 79,761, ఇతరులు ఏడుగురు.. మొత్తం 1,55,961 మంది ఓటర్లు ఉన్నారు. భద్రాచలం నియోజకవర్గానికి సంబంధించి జిల్లా పరిధిలో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాలు, వాజేడు, వెంకటాపురం మండలాలు ములుగు జిల్లాలో ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో కలిపి 121 లొకేషన్లలో 176 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ పురుష ఓటర్లు 71,437, మహిళా ఓటర్లు 77,220, ఇతరులు నలుగురు.. మొత్తం 1,48,661 మంది ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోలింగ్ సామగ్రి పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది బుధవారం ఉదయం 6 గంటల వరకు పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. గైర్హాజరైన వారిని ఎన్నికల నియమావళి ప్రకారం సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మెటీరియల్ తీసుకున్న సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకుని పోలింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

30న వేతనంతో కూడిన సెలవు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వ్యాపార సముదాయాలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా గురువారం వేతనంతో కూడిన సెలవు మంజూరు చేసినట్లు ప్రియాంక ఆల తెలిపారు. ఈ మేరకు కార్మిక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాలైన ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు బుధవారం కూడా సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

లెక్కింపు కేంద్రం వద్ద పటిష్ట ఏర్పాట్లు..

పాల్వంచ : ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. స్థానిక అనుబోస్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, లెక్కింపు కేంద్రంలో ఐరన్ మెష్ ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత స్థలంలోనే వాహనాలు నిలిపేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఏర్పాట్లను పర్యవేక్షించాలని సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ వినీత్, మున్సిపల్ కమిషనర్ స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జెన్‌కో టోర్నీలో 'కేటీపీఎస్' ప్రతిభ

పాల్వంచ : ఈ నెల 24, 25వ 26 తేదీల్లో నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని శ్రీశైలం లెఫ్ట్ కెనాల్ హైడల్ స్టేషన్‌లో జరిగిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడా పోటీల్లో కేటీపీఎస్ 7వ దశ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. టేబుల్ టెన్నిస్‌లో ఎస్.శ్యామ్యూల్, జి.కృష్ణ, బి.విద్యాసాగర్, కె.వి.రమణ తృతీయ స్థానం, సింగిల్స్‌లో ఎస్.శ్యామ్యూల్ ప్రథమ, టెన్నికాయిట్ మహిళా విభాగం సింగిల్స్‌లో పి.పావని ద్వితీయ బహుమతులు సాధించారు. విజేతలను సీఈ పి.వెంకటేశ్వరరావు, గేమ్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వరరావు, డీఈ ఎస్ఎస్ఎస్ శేఖర్ మంగళవారం అభినందించారు.

బెల్టు షాప్ నిర్వాహకులపై కేసు

భద్రాచలంఅర్బన్: బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఐటీడీఏ రోడ్డులో మెడికల్‌కాలనీకి చెందిన యరమల శ్రీనివాసరెడ్డి వద్ద రూ.1,782 విలువ గల 1.6 లీటర్ల మద్యం, సుబాష్‌నగర్‌కాలనీకి చెందిన పోతురాజు విజయ వద్ద రూ.2,570 వేల విలువ గల 2.3 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు టౌన్ సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని యాచకుడు మృతి

సుజాతనగర్: గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. తమిళనాడు ప్రాంతానికి చెందిన యాచకుడు సుమారు 30 ఏళ్ల కిందట సుజాతనగర్ వచ్చి హోటళ్లు, ఇళ్ల వద్ద యాచిస్తూ గడుపుతున్నాడు. అనారోగ్యంతో ఈ నెల 25న మృతి చెందగా.. స్థానిక పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.సోమేశ్వర్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

పాల్వంచ: లారీ, కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. వాహనాల్లో గంజాయి తరలుతున్నట్లు సమాచారం అందటంతో బీసీఎంరోడ్డు కాలనీ–సీ పోలీసులు మాటు వేశారు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు లారీ, కారులో తరలిస్తున్న గంజాయి బండిళ్లు, బస్తాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం గంజాయి క్వింటా 700 గ్రాములు ఉండగా, దాని విలువ రూ.25,17,500 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఈమేరకు లారీ డ్రైవర్ శ్రీకాంత్, కారులోని నర్సింహారావు, విజయ్‌కుమార్, రవికుమార్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బియ్యం అక్రమ రవాణాదారులపై కేసు

పాల్వంచ : పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాదారులపై పాల్వంచ రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఈనెల 18న కొత్తగూడెంలో 20 క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేసి బొలేరో వాహనంలో మణుగూరుకు తరలిస్తుండగా పాల్వంచ మండలం జగన్నాథపురం సమీపంలో ఎస్‌ఐ కార్తీక్ పట్టుకున్నారు. ఆ బియ్యాన్ని పౌర సరఫరాల డీటీ సుంకర శ్రీనివాస్ టెక్నికల్ టీంకు అప్పగించగా అవి పీడీఎస్ బియ్యమేనని నిర్ధారిస్తూ నివేదిక ఇచ్చారు. దీంతో మణుగూరు మండలం రామనుజారానికి చెందిన రావుల శ్రీనివాసరావు, నాగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

విద్యానగర్‌లో చోరీ

చుంచుపల్లి: పట్టణంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ ఇంట్లో చోరీ జరిగింది. మంగళవారం జరిగిన ఈ ఘటనకుసంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఆటోడ్రైవర్‌గా జీవనాన్ని వెళ్లదీస్తున్న అనుగోజు వెంకటాచారి విద్యానగర్‌లో నివాసముంటున్నారు. చారి దంపతులు మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చారు. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా పరుపు కింద దాచి భద్రపదర్చిన రూ.50 వేల నగదుతోపాటు చీరెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించారు. ఘటనపై చుంచుపల్లి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

అక్కడ ఎలా ఉంది ?!

- ఎన్నికలపై ఎన్‌ఆర్‌ఐల ఆరా
- ప్రచార శైలి, బలాబలాలపై ఆసక్తి



తెలంగాణ ఏర్పడ్డాక ఎవరు గెలుస్తారోనని దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు వారు ఆసక్తి కనబరిచారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు హోరాహోరీగా తలపడుతుండడం.. కొన్నిచోట్ల ఇతర పార్టీల అభ్యర్థులు కూడా దీటైన పోటీ ఇస్తుండడంతో ఎన్‌ఆర్‌ఐలు ఇక్కడి తమ బంధువులు, స్నేహితులకు తరచుగా ఫోన్ చేస్తున్నారు. అభ్యర్థి ఎవరు, ప్రచారం ఎలా జరుగుతోంది, బలాబలాలు ఎలా ఉన్నాయి.. విజయం ఎవరి వైపు ఉందనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా సుజాతనగర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఇతర దేశాల్లో స్థిరపడిన పలువురితో మాట్లాడగా వారు తమ అభిప్రాయాలు వెల్లడించారు. – సుజాతనగర్

ఎవరు గెలుస్తారోనని ఆసక్తి



సుజాతనగర్‌కు చెందిన చెందిన నేను వర్జీనియాలో ఉంటున్నా. పుట్టి, పెరిగిన ప్రాంతం కావడంతో ప్రతీ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే అంశంపై ఆసక్తి ఉంటుంది. అందుకే మీడియాను ఫాలో అవుతూనే స్నేహితులకు తరచూ ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటున్నా.

– మల్లెల అనూష, వర్జీనియా

ప్రతీ ఎన్నికనూ పరిశీలిస్తాం



సుజాతనగర్‌కు చెందిన నేను ప్రతీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల శైలిని నిశితంగా పరిశీలిస్తా. అమ్మానాన్నల ద్వారా ఎవరు గెలుస్తారు, ఏ ప్రభుత్వం ఏర్పడితే బాగుంటుందనేది తెలుసుకుంటా. విజయావకాశాలు ఎటు ఉన్నాయో స్నేహితులతో చర్చిస్తా.

–పోటు ఫణిభూషణ్, అమెరికా

ఎన్నికలపైనే చర్చ



ఈసారి ఎన్నికలపై అంతటా ఆసక్తి ఉంది. ప్రధానంగా మూడు పార్టీలు విజయం కోసం పోటీ పడుతుండటంతో, ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానిపైనే మా దగ్గర కూడా చర్చ జరుగుతోంది. కొత్తగూడెంలో ఎవరు గెలుస్తారనే ఆసక్తి నెలకొంది.

–నర్రా సాయికిరణ్, ఆస్ట్రేలియా

ఓటుహక్కు వినియోగించుకోవాలి



అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి. తెలంగాణలో ఎన్నికల సంబంధించిన అంశాలను ప్రతిరోజూ టీవీ ద్వారా తెలుసుకుంటున్నా. కొత్తగూడెంలో ఏ పార్టీ గెలుస్తుంది, ప్రచారం ఎలా జరుగుతుందో కుటుంబీకులద్వారా తెలుసుకుంటున్నా.

–చింతలపూడి కార్తీక్, కెనడా

రాజకీయ.. 'ఉపాధి' ఆగింది!

- పక్షం రోజులు ప్రచారంలో పాల్గొన్న కూలీలు
- మైకులు, డీజే, బ్యాటరీ రీచార్జ్ దుకాణాలకు భలే గిరాకీ
- గిరగిరా తిరిగిన ఆటోలు, ట్రాలీలు



ప్రచారంలో దప్పు కళాకారులు



కోలాటం కళాకారులు..

ఇల్లెందురూరల్: అసెంబ్లీ ఎన్నికలు వేళ పార్టీల కార్యకర్తలు, నాయకులకు ఎలా ఉన్నా కూలీలు, డ్రైవర్లు, హోటల్ యజమానులు, కళాకారులు, చిరు వ్యాపారులకు మాత్రం మంచి ప్రయోజనాన్ని చేకూర్చాయి. పక్షం రోజులపాటు ఆయా వర్గాలను ఆదుకున్న రాజకీయ ఉపాధి మంగళవారంతో ఆగిపోయింది. నామినేషన్ల గడువు ముగిసిన నాటి నుంచి ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ప్రచారంలో రోజువారీ కూలీలను వినియోగించుకున్నారు. ప్రతీ నియోజకవర్గంలో కూలీలు ప్రచారంలో పాల్గొనగా.. ప్రతిరోజు వారికి భోజనం, మద్యంతో డబ్బులు కూడా ఇచ్చారు. దీంతో చాలా మంది రోజువారీ పనులు వదిలేసి ప్రచారానికే పరిమితమయ్యారు. దీంతో కూలీలకు రోజుకు రూ.200 నుంచి రూ.300 వరకు ఇచ్చినట్లుగా సమాచారం.

అన్నింటికీ గిరాకీ

ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ప్రచారంలో కూలీలతోపాటు ప్రచార రథాలు, డప్పులు, మైకులు, కరపత్రాలను వినియోగించారు. దీంతో ఆటోవాలా, టాటా ఏసీ, ట్రాలీలకు గిరాకీ ఏర్పడింది. వాహనాలకు మూడు వైపులా ఫ్లెక్సీలను బిగించి మైకులతో ప్రచారం సాగించారు. ప్రతిరోజు ఆటోకు డీజిల్ పోసి రూ.500నుంచి రూ.700వరకు చెల్లించారు. ప్రచార రథాలకు అన్ని హంగులు కల్పించి 15రోజులపాటు అద్దె ప్రాతిపదికన రూ.30వేలు వరకు చెల్లించారు. అలాగే, కార్లు, ఇతర వాహనాలకు రోజుకు రూ.వెయ్యి చొప్పున ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే, డప్పు కోసం రూ.3వేల నుంచి రూ.పది వేల వరకు ఖర్చు చేయడమేకాక షామియానాలు, భోజనాలు, మందు పంపిణీకి డబ్బు వెచ్చించారు. దీంతో హోటళ్లు, క్యాటరింగ్ సంస్థల నిర్వాహకులకు కూడా నగదు సమకూరింది. ఇక ప్రచారంలో పాల్గొన్న డబ్బు కళాకారులు, గాయకులకు 15రోజుల పాటు ఉపాధి లభించింది. అభ్యర్థులు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఖర్చు విషయంలో రాజీ పడకపోవడంతో చాలా మందికి బిజీబిజీగా గడపడమే కాక నాలుగు రూపాయిలు సంపాదించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల కేటాయింపులో తప్పు



ఆసుపాక పోలింగ్ కేంద్రం కేటాయించిన ఓటరు స్లిప్పు

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు పోలింగ్ కేంద్రాల కేటాయింపుల్లో తప్పు దొర్లింది. అశ్వారావుపేటలోని పోస్టాఫీస్ ప్రాంతంలో నివాసం ఉంటున్న కాకి పవన్‌కుమార్‌కు ఇటీవలె కొత్తగా ఓటు హక్కు వచ్చింది. తుది జాబితాలో స్థానిక ఓటరుగా నమోదు చేసి అశ్వారావుపేటలో గల పోలింగ్ కేంద్రాన్ని కేటాయించాల్సి ఉంది. కానీ, పవన్‌కుమార్‌కు దాదాపు 20 కిలో మీటర్ల దూరంలోని మండలంలో ఆసుపాక గ్రామంలోని ఓటరు జాబితాలో క్రమ సంఖ్య 206 కింద నమోదు చేసి, ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం నంబరు 144ను కేటాయించడం విశేషం. దీంతో ఈ నెల 30వ తేదీన సదరు యువకుడు ఆసుపాక వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఓటర్లకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరుస్లిప్పులు అందించాల్సి ఉండగా, నేటికీ చాలా మంది ఓటర్లకు స్లిప్పులు అందలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమందికి ఓటరు కార్డులు ఉన్నప్పటికీ, తాజా జాబితాలో పేర్లు గల్లంతైనట్లు వాపోతున్నారు. స్థానిక ఏఆర్‌ఓ కృష్ణప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఓటరు నమోదు సమయంలోనే తప్పుగా నమోదు చేసి ఉంటారని, పోలింగ్ తర్వాత ఫాం–8 ద్వారా అశ్వారావుపేటకు మార్పు చేస్తామని తెలిపారు. ఈ సారికి ఓటు ఆసుపాక పోలింగ్ కేంద్రానికి వెళ్లి వేయాల్సిందేనన్నారు.

భద్రత కట్టుదిట్టం..

- సరిహద్దుల్లో భారీగా మోహరించిన పోలీసు యంత్రాంగం
- అటవీ ప్రాంతాల్లో ముమ్మరంగా కూంబింగ్ ఆపరేషన్



చర్ల నుంచి సరిహద్దు గ్రామాలకు తరలివెళ్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

చర్ల: తెలంగాణలో జరుగుతున్న శాసనసభ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన మావోయిస్టులు ఎలాంటి విధ్వంసాలకు పాల్పడకుండా ఉండేలా సరిహద్దులో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. రెండు రోజులుగా సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాలకు చేరుకుంటున్న బలగాలు కూంబింగ్ చేపట్టాయి. సరిహద్దులో ఉన్న పూసుగుప్ప, వద్దిపేట, చెన్నాపురం, చెలిమెల, తిప్పాపురం, తోగ్గూడెం సీఆర్‌పీఎఫ్ క్యాంపులకు అదనపు బలగాలను తరలించి భద్రతను కట్టుదిట్టం చేశారు. చర్ల మండల సరిహద్దు గ్రామాలైన కుర్నపల్లి, బోదనెల్లి, కొండెవాయి, పులిగుండాల, ఎర్రంపాడు, చెన్నాపురం, బత్తినపల్లి, తిప్పాపురం, ఉంజుపల్లి, వద్దిపేట, పూసుగుప్ప గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, కోబ్రా, ఎస్‌టీఎఫ్ బలగాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మండలం నుంచి సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంత గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులలో స్పెషల్ పార్టీ పోలీసులు వచ్చి పోయే వారిని నిశితంగా తనిఖీ చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గ్రామాలకు చెందిన వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయం..'

ఖమ్మంఅర్బన్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు తోడు దొంగలని ప్రజలు గుర్తించిన నేపథ్యాన ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఖమ్మంలోని పలు డివిజన్లతో పాటు రఘునాథపాలెం మండలంలో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మంగళవారం జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి కోసం పాటు పడే తుమ్మల నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు. కేసీఆర్ ఖజానా నింపుకుని కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిందని.. దీంతో బీజేపీని ఆశ్రయించి ఇబ్బంది లేకుండా చేసుకుంటున్నారని ఆరోపించారు. కాగా, బీఆర్‌ఎస్ పాలనలో ఏ వర్గానికి న్యాయం జరగని నేపథ్యాన కాంగ్రెస్, మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని నారాయణ కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు మానుకొండ రాధాకిషోర్, లకావత్ సైదులు, మలీదు జగన్, మలీదు వెంకటేశ్వర్లు, నల్లమల వెంకటేశ్వర్లు, చోటా బాబా, బాషా, భూక్యా గౌరి, రేమళ్ల రమేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటరు చైతన్య యాత్ర ముగింపు

కల్లూరు రూరల్: కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన దంతాల సుధాకర్ ఓటర్లలో చైతన్యం కల్పించేలా చేపట్టిన బైక్ యాత్ర మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఖమ్మం చేరుకున్న ఆయనను కలెక్టర్ గౌతమ్ అభినందించారు. వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా పది రోజుల పాటు యాత్ర చేపట్టానని సుధాకర్ తెలిపారు.

నగదు సీజ్



నగదు సీజ్ చేస్తున్న అధికారులు

దమ్మపేట: దమ్మపేట శివారు నెమలిపేటలోని పెట్రోల్‌బంక్ సమీపంలో ఏపీ రాష్ట్రం ఏలూరు నుంచి భద్రాచలం వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా రూ.10 లక్షల నగదును గుర్తించారు. మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద చేస్తున్న తనిఖీల్లో కారులో రూ.80,000ల నగదును గుర్తించారు. వీటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామని ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ, ఎస్‌ఐ రవికుమార్ మంగళవారం తెలిపారు.

భారీగా మద్యం సీజ్



పట్టుబడిన మద్యం సీసాలు

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు చేస్తున్న తనిఖీల్లో భారీగా మద్యం సీసాలను పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం దురదపాడు గ్రామంలో ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ చేసిన 695 క్వార్టర్ సీసాలు దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకొని, సీజ్ చేశామని పోలీసులు చేశారు.

వివాహిత ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: అత్తింటివారి వేధింపులు భరించలేక ఓ వివాహిత పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రానికి చెందిన పాడియం సునీత (23) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన సున్నం శ్రీనును నాలుగేళ్ల కిందట ప్రేమించి పెళ్లిచేసుకుంది. ఏడాది గడిచిన తరువాత భర్తతోపాటు అత్త పాడియం దుర్గ, మామ రామయ్య కలిసి అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారు. వేధింపులు రోజురోజుకూ పెరిగిపోవడంతో భరించలేక సోమవారం ఉదయం ఇంట్లోనే పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబీకులు తక్షణమే అశ్వారావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం జరిపించి, అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మృతురాలి తండ్రి పాడియం వెంకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిర్చి తోట ధ్వంసం



ధ్వంసమైన మిర్చితోట

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట గ్రామపంచాయతీ వీరాపురం గ్రామానికి చెందిన బానోత్ రాందాస్‌కు చెందిన ఎకరంన్నర మిర్చితోటను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం పూర్తిగా ధ్వంసం చేశారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే రాందాస్ తనకు ఉన్న ఎకరంన్నర తోటలో మిర్చి సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం మిర్చి కాతకు రావడంతో ఆనందంతో ఉన్నాడు. మరికొద్ది రోజుల్లో చేతికందుతుందన్న దశలో గుర్తు తెలియని వ్యక్తులు చేనులోని మొక్కలన్నింటిని కాండం భాగంలో విరగగొట్టారు. రోజుమాదిరిగానే ఉదయం చేను వద్దకు వెళ్లిన రాందాస్ జరిగిన నష్టాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యాడు. గ్రామస్తుల సహకారంతో ఇల్లెందు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాతకు వచ్చిన చేను పూర్తిగా ధ్వంసం కావడంతో రైతు రాందాస్‌కు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని స్థానిక రైతులు తెలిపారు.

మద్యం దుకాణాలపై నిఘా

కొత్తగూడెంఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 30వ తేదీ సాయంత్రం వరకు జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు డిపోలు మూసేయాలని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి జానయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సిబ్బంది పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మద్యం దుకాణాలు తెరిచినా, మరే ఇతర ఫిర్యాదులు ఉన్నా 08744–242464 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని ప్రజలను కోరారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఇల్లెందు: ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ ఎస్‌వీ రమణమూర్తి అన్నారు. మంగళవారం ఇల్లెందులో పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించగా.. డీఎస్పీ మాట్లాడారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల ద్వారా ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలని, ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కవాతులో సీఐ కరుణాకర్, ఎస్‌ఐ రవూఫ్, అప్పారావు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: ఈ నెల 30న జరగబోయే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి కోరారు. మంగళవారం రాత్రి టేకులపల్లి పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు కవాతు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడారు.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని సూచించారు. రాత్రి నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, ఎస్‌ఐలు రమణారెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యాపారి దుర్మరణం

అశ్వారావుపేటరూరల్: లారీ ఢీకొని ఓ వ్యాపారి దుర్మరణం చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని నందమూరినగర్‌కు చెందిన బట్టల వ్యాపారం చేసే సోమలంక సత్యనారాయణ (60) ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి వెళ్లి బట్టలు కొనుగోలు చేసి తిరిగి వచ్చాడు. రోడ్డు దాటి తన ఇంటికి వెళ్లేందుకు నిలబడిన సమయంలో సత్తుపల్లి వైపు నుంచి జంగారెడ్డిగూడేనికి వెళ్తున్న బొగ్గు లారీ అదుపుతప్పి ఢీకొట్టి, అతడి పైనుంచి వేగంగా దూసుకెళ్లింది. దీంతో సత్యనారాయణ శరీరం పొట్ట భాగం నుంచి కిందకు నుజ్జునుజ్జు అవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శివరామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సరిహద్దు చెక్ పోస్టు ముట్టడి..

కాగా, వారం రోజుల వ్యవధిలో ఇదే ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, కాలనీవాసులు సరిహద్దు చెక్ పోస్టు వద్ద ఆందోళన చేపట్టారు. వాహనాలు వేగంగా దూసుకొస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో వారంతా వెనుతిరిగారు.

ముక్కోటి ఏర్పాట్లు ప్రారంభం



రంగులు వేస్తున్న పెయింటర్లు



ఆలయం ఎదుట చలువపందిళ్లు వేస్తున్న కూలీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో డిసెంబర్ 13 నుంచి జనవరి 2 వరకు నిర్వహించే వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలకు గాను ఏర్పాట్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ద్వారాలకు రంగులు వేయడం, విద్యుత్ దీపాలంకరణ, ఆలయం చుట్టూ చలువ పందిళ్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపడుతున్న ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

1 నుంచి పునర్వసు దీక్ష

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో వచ్చేనెల 1న కార్తీక మాస పునర్వసు నక్షత్రం రోజున శ్రీరామ పునర్వసు దీక్ష ప్రారంభమై 28వ తేదీన ముగుస్తుందని ఈఓ రమాదేవి తెలిపారు. అదేరోజు గిరి ప్రదక్షిణ, పాదుకాపూజ, దీక్షా విరమణ ఉంటాయని, రాత్రి 7 గంటలకు వెండి రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.